క్లుప్తంగా

దుస్తుల పంపిణీ

నెల్లూరు(బృందావనం) : నగరంలోని సుబేదారుపేటలో కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు అధ్యక్షుడు కేతా సుబ్బారావు మాట్లాడుతూ ఏవీకే ఫౌండేషన్ అధినేత విజయకుమార్ సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. అలాగే అల్పాహారం పంపిణీ చేసినట్లు వివరించారు. అనంతరం ఘంటసాల గీతాలను ఆలపించామన్నారు.

నాగులవరం సమీపంలో గుర్తుతెలియని మృతదేహం

బిట్రగుంట: బోగోలు మండలం నాగులవరం సమీపంలో డీఎం ఛానెల్లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు సోమవారం గుర్తించారు. మృతదేహం ఉబ్బిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. మృతుడి వయసు 25 నుంచి 30 ఏళ్ల లోపు ఉంటుందని భావిస్తున్నారు. పసుపు రంగు టీషర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. సుమారు నాలుగు రోజుల క్రితమే మృతిచెంది ఉండొచ్చని భావిస్తున్నారు. స్థానికుల సమాచారం మేరకు బిట్రగుంట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గేదెను ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు

ఆత్మకూరు: మోటార్‌బైక్‌పై వస్తూ గేదెను ఢీకొనడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన సోమవారం రాత్రి నెల్లూరుపాళెం వద్ద జరిగింది. స్థానిక వైఎస్సార్ కాలనీలో నివాసం ఉండే ఎం.ఉమేష్ తన ఇంటి నుంచి ఆత్మకూరుకు బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా గేదె అడ్డు రావడంతో దానిని ఢీకొట్టి రోడ్డు మీద పడిపోయాడు. దీంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ప్రమాదంలో గేదె మృతిచెందింది. క్షతగాత్రుడిని సమీపంలోని ఆత్మకూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేసిన డాక్టర్లు పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనం ద్వారా నెల్లూరుకు తరలించారు.

రెండు ఆటోల ఢీ

సోమశిల: రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటన సోమశిల సమీపంలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. పాల క్యాన్లతో వెళ్తున్న ఆటో చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. మరో ఆటోలో ప్రయాణిస్తున్న మస్తాన్, నందిని స్వల్ప గాయాలయ్యాయి.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో కార్యదర్శి ప్రతిభ



ముత్తుకూరు: 43వ ఏపీ స్టేట్ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ముత్తుకూరు పంచాయతీ కార్యదర్శి చక్రం వెంకటేశ్వర్లు ప్రతిభ చూపారు. రామాయపట్నంలో ఆది, సోమవారాల్లో ఈ టోర్నమెంట్ జరిగింది. ఆడుదాం ఆంధ్రా స్ఫూర్తితో ఆయన మన జిల్లా నుంచి ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్నారు. ఇందులో భాగంగా 100 మీటర్ల రన్నింగ్ రేస్‌లో 3వ స్థానం, ట్రిపుల్ జంప్‌లో రెండో స్థానం సాధించారు. అథ్లెటిక్స్ రాష్ట్ర కార్యదర్శి మంగ వరప్రసాద్ నుంచి పతకాలు స్వీకరించారు.

హ్యాపీ క్రిస్మస్.. మెర్రీ క్రిస్మస్

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ఆధ్యాత్మిక చింతనతో కళకళలాడిన క్రీస్తు మందిరాలు



ది లోన్ స్టార్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు



క్యాండిల్స్ వెలిగిస్తూ..

నెల్లూరు(బృందావనం) : లోక రక్షకుడు, కరుణామూర్తి, శాంతిదూత ఏసుక్రీస్తు జన్మించిన క్రిస్మస్ పర్వదినాన్ని నగరంలో సోమవారం ఘనంగా, ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. క్రిస్మస్ పండగ సందర్భంగా ఆదివారం ఉదయం నుంచి పాటలు, వాక్యోపదేశాలతో ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. విష్ యూ హ్యాపీ క్రిస్మస్.. విష్ యూ మెర్రీ క్రిస్మస్.. అంటూ క్రైస్తవ సంఘీయులు ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రతి ఆరాధనలో క్రైస్తవ సంఘీయులు ఏసుక్రీస్తును స్తుతిస్తూ పాడిన భక్తిగీతాలు విశ్వాసుల మదిని మైమరపించాయి. క్యాండిల్స్ వెలిగించి లోకరక్షకుడిని వేడుకుంటూ భక్తులు ప్రార్థనలు చేశారు.

చర్చిల్లో ఆరాధనలు

నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉండే ది లోన్‌స్టార్ బాప్టిస్టు చర్చిలో రెవరెండ్ కంచర్ల ప్రభుదాస్, రెవ విజయకుమార్‌సాలి ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరాధనలు చేశారు. సంతపేటలోని రోమన్ కేథలిక్ కెథడ్రిల్‌లో బిషప్ మోస్ట్ రెవరెండ్ ఎండీ ప్రకాశం ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత అర్ధరాత్రి బాలఏసు ప్రతిమను ప్రజలకు చూపించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. రైల్వేఫీడర్స్ రోడ్డులోని లోన్‌స్టార్ బాప్టిస్టు చర్చిలో రెవ బెన్‌హర్ పాస్టర్ ఆధ్వర్యంలో, ది జేమ్స్ ఆఫ్ క్రైస్ట్ చర్చిలో రెవ జెరోమ్ ఆధ్వర్యంలో క్రిస్మస్ ఆరాధనలు నిర్వహించారు. వీఆర్సీ సెంటర్ వద్ద ఉన్న బాప్టిస్టు చర్చి టౌన్‌హాల్‌లో ఉదయం రెవరెండ్ కె.శ్యామ్‌సన్‌కుమార్ తెలుగు ఆరాధనలో వాక్యోపదేశం చేశారు. సాయంత్రం ఇంగ్లిష్ సర్వీస్ చాప్లిన్ రెవ. డేవిడ్ లివింగ్‌స్టన్ ఆధ్వర్యంలో ఇంగ్లిష్‌లో క్రిస్మస్ ఆరాధనలు చేశారు. బట్వాడిపాళెంలోని ది సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చిలో రెవ.హారీపాల్ ఆధ్వర్యంలో, నీలగిరి సంఘం హెబ్రోన్ బిలీవర్స్ అసెంబ్లీస్ చర్చిలో రెవ. డేవిడ్ దయాసాగర్ ఆధ్వర్యంలో క్రిస్మస్ ఆరాధనలు నిర్వహించారు. ఫత్తేఖాన్‌పేటలోని సెయింట్ ఆంటోని చర్చిలో, రామిరెడ్డిపేటలోని ది తెలుగు సెకండ్ బాప్టిస్టు చర్చిలో, పొదలకూరు రోడ్డు కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఉన్న ది సాల్వేషన్ ఆర్మీ చర్చిలో, పొదలకూరు రోడ్డులోని యునైటెడ్ బాప్టిస్టు చర్చిలో, వేదాయపాళెంలోని ది గుడ్‌న్యూస్ బాప్టిస్టు చర్చి, ఏసీఎస్ఆర్ స్టేడియం దగ్గర ఉన్న ఎల్ఎల్ఎఫ్ చర్చిలో అలాగే నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న క్రైస్తవ మందిరాల్లో ప్రత్యేక క్రిస్మస్ ఆరాధనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ది యునైటెడ్ క్రిస్టియన్ చర్చిలో..

నెల్లూరు సిటీ : క్రిస్మస్ పండగను గొతమినగర్‌లోని ది యునైటెడ్ క్రిస్టియన్ చర్చిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పాపుల రక్షణ కోసం శిలువపై ఏసుక్రీస్తు చిందించిన రక్తం త్యాగానికి, క్షమ, కరుణ, ప్రేమలకు ప్రతీత అని సంఘ కాపరి రెవరెండ్ ఎంఎం షారోన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రీస్తు జనన వృత్తాంతాన్ని వివరిస్తూ సంఘ యువత భక్తిగీతాలు ఆలపించారు. అనంతరం సంఘకాపరి, పెద్దలు కలిసి పేదలకు వస్త్రదానం చేశారు. కటారి జయమ్మ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె కుటుంబసభ్యులు చర్చి వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో కటారి సాయిప్రతాప్, కటారి చిన్ని, సంఘ పెద్దలు ఆర్.జయప్రసాద్, జి.విలియమ్‌జోసఫ్, ఎం.వినోద్‌కుమార్, డి.దేవదానం తదితరులు పాల్గొన్నారు.



సంతపేట చర్చిలో ఏసుప్రభువుకు పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే అనిల్



బాలఏసుకు ప్రార్థన చేస్తూ..



పశువుల పాక వద్ద సెల్ఫీ దిగుతున్న యువత



నెల్లూరు సిటీ : అన్నదానం చేస్తున్న సంఘ కాపరి

అయ్యప్పస్వామికి విశేష పూజలు



నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థానంలో స్వామివారికి మూడు రోజుల పాటు జరిగే చందనోత్సవం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. తొలిరోజు సోమవారం అయ్యప్పస్వామికి కేరళ సంప్రదాయ రీతిలో, శాస్త్రోక్తంగా అభిషేకం, హోమం, పూజాదికాలు, ప్రాకారోత్సవం కనులపండువగా జరిగింది. ఆయా పూజా కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదం, భిక్షను స్వీకరించారు. ఉభయకర్తలుగా కుందా సూర్యనారాయణరెడ్డి, ప్రభావతమ్మ, ప్రదీప్, సింధూరలక్ష్మి, కురుగొండ్ల రామకృష్ణ, సింధు అల్లాడిహేమ, వేలూరు మునుస్వామి, మల్లీశ్వరి, బుట్టా రంగయ్య, సీహెచ్ శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసులురెడ్డి వ్యవహరించారు. కార్యక్రమాలను అయ్యప్ప సేవా సమాజం అధ్యక్ష, కార్యదర్శులు జి.శేషగిరిరావు, కె.వెంకటరత్నం, జి.రత్నయ్య, విజయన్, కె.మోహన్‌రావు, కేజీ శంకరన్, బి.మురళీ మోహన్‌రెడ్డి పర్యవేక్షించారు.

విద్యా ప్రోత్సాహకాల అందజేత



నెల్లూరు(బృందావనం) : పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో చక్రాలవారి ట్రస్ట్ ఆధ్వర్యంలో 16 మంది విద్యార్థులకు రూ.10 వేల చొప్పున విద్యాప్రోత్సాహకాలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనందకుమార్ మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా వైద్య, ఇంజినీరింగ్ విద్యనభ్యసిస్తున్న వారికి రూ.1.60 లక్షలు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ధ్యాన మందిరం అధ్యక్షుడు పారాగురు వెంకట శ్రీధర్‌శర్మ, కోట శ్రీరామమూర్తి, జి.వరప్రసాదరావు, బీబీకే సుందరరావు, ట్రస్టీలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాపత్తు ఉత్సవాలు



ఉభయదేవేరులతో తల్పగిరి రంగనాథుడు



ఉభయదేవేరులతో వేణుగోపాలుడు

నెల్లూరు(బృందావనం) : నగరంలోని వైష్ణవాలయాల్లో పది రోజుల పాటు నిర్వహించే రాపత్తు ఉత్సవాల్లో మూడో రోజు సోమవారం శ్రీవారు విశేషాలంకారాల్లో ఉభయదేవేరులతో కొలువై భక్తులను అనుగ్రహించారు. రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో స్వామివారు విశేషాలంకరణలో కొలువుదీరారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. రాపత్తు ఉత్సవం ఉభయకర్తలుగా గుర్రం రామానుజంశెట్టి, మంగతాయారమ్మ జ్ఞాపకార్థం మనుమలు వ్యవహరించారు. మూలాపేటలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఉభయకర్తగా పద్మావతి వ్యవహరించారు.

నుడా చైర్మన్‌కు డిప్యూటీ మేయర్ అభినందన



నెల్లూరు (దర్గామిట్ట) : నుడా చైర్మన్‌గా రెండోసారి నియమితులైన ముక్కాల ద్వారకానాథ్‌ను ఆయన నివాసంలో నెల్లూరు డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్‌కుమార్ యాదవ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట మూలస్థానేశ్వరస్వామి దేవాలయం చైర్మన్ లోకిరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత దార్ల వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు ఎస్సార్ ఇంతియాజ్, గోగుల నాగరాజు, మైనారిటీ నేత షేక్ హాజీ ఉన్నారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



కేక్ కట్ చేసి తినిపిస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి చిత్రంలో మేయర్ స్రవంతి

నెల్లూరురూరల్ : శాంతిని కాంక్షిస్తూ ఏసుక్రీస్తు చేసిన బోధనలు ఆచరణీయని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ పరిధిలోని వెంగళరావునగర్‌లో రైల్వేబోర్డు మెంబర్, వైఎస్సార్‌సీపీ నేత స్వర్ణా వెంకయ్య ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కటింగ్ నిర్వహించారు. అనంతరం ఆదాల మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గంలోని క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ కోటేశ్వరరెడ్డి, పార్టీ నేతలు నాయకులు వైవీ రామిరెడ్డి, హరిబాబు యాదవ్, ఏసునాయుడు, పద్మజా యాదవ్, వైఎస్సార్‌సీపీ ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు పాలకీర్తి రవి, ఏఎంసీ డైరెక్టర్ స్వర్ణా జీవన్‌ప్రసాద్, కార్పొరేటర్ అవినాష్, పార్టీ 33వ డివిజన్ ఇన్‌చార్జి మేఘనాథ్‌సింగ్, మర్రిపాడు జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా నగరోత్సవం



సప్ర మహోత్సవానికి విశేషంగా తరలివచ్చిన క్రైస్తవులు



సప్ర మహోత్సవంలో బాల ఏసు

నెల్లూరు(బృందావనం) : సంతపేటలోని రోమన్ కేథలిక్ కెథడ్రిల్(ఆర్సీఎం) చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో భాగంగా సోమవారం రాత్రి బాలఏసు సప్ర మహోత్సవం కనులపండువగా జరిగింది. భక్తిగీతాలాపనలు, క్రిస్మస్ సందేశాలు, బాణసంచా వెలుగుల్లో బాలఏసు నగరోత్సవం సంతపేట, చేపల మార్కెట్, రైల్వేఫీడర్స్‌రోడ్డు, కపాడిపాళెం తదితర ప్రాంతాల మీదుగా వేడుకగా సాగింది. తొలుత బాలఏసు కొలువైన రథాన్ని సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ లాగి నగరోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం సంతపేట మార్కెట్‌లో వైఎస్సార్‌సీపీ నేత శౌరి ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో నూతన ఉత్సాహం, సంతోషాలు ఉండాలని, ఏసుప్రభువు ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అలాగే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆ దేవుని దీవెనలు ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కాయల సాహిత్య, గుంజి జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.



క్యాండిల్స్ వెలిగిస్తున్న మహిళలు



ప్రార్థనలు చేస్తున్న భక్తులు

పేదలకు దుప్పట్ల పంపిణీ



నెల్లూరు(సెంట్రల్) : క్రిస్మస్ పండగను పురస్కరించుకుని పర్వతరెడ్డి బలరామిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నగరంలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం సమీపంలో పేదలకు సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు కొణిదల సుధీర్, ట్రస్ట్ సభ్యులు జి స్రవంతి, సురేష్, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ఆడుదాం ఆంధ్రా



క్రీడా పోటీలకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులకు సూచించారు. స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆడుదాం ఆంధ్రా పోటీల నిర్వహణ ఏర్పాట్లను కమిషనర్ సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి ఈనెల 26 నుంచి శ్రీకారం చుట్టనుందని, ఇందులో భాగంగా క్రీడాకారుల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా ముందస్తుగా రెండు రోజుల పాటు ప్రారంభోత్సవ వేడుకలను నిర్వహించినట్లు చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు 1.8 లక్షల మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేందుకు రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 333 మైదానాలను క్రీడలకు అనువుగా సిద్ధం చేసినట్లు చెప్పారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ ఆటల్లో పోటీలు ఉంటాయని, విజేతలకు నగదు పురస్కారాలతో పాటు, సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ, క్రీడల నిర్వహణాధికారి యతిరాజ్, సచివాలయాల కార్యదర్శులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పుర మందిరంలో బలిజ మహాసభ

నెల్లూరు(బృందావనం) : నగరంలోని పుర మందిరంలో రాయలసీమ బలిజ మహాసభ సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీహరిరాయలు వెలిశెట్టి, జిల్లా కాపునాడు అధ్యక్షుడు సంపతి హనుమంతరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి నగర టీడీపీ ఇన్‌చార్జి పొంగూరు నారాయణ హాజరయ్యారు. తొలుత న్యూ ఇయర్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ప్రతిభ గల 20 మంది విద్యార్థులకు రూ.5 వేల చొప్పున నగదు అందజేశారు.

వాజ్‌పేయికి ఘన నివాళి

నెల్లూరు(మినిబైపాస్) : దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి జయంతి సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో నగరంలోని జాకీర్‌హుస్సేన్‌నగర్, కిసాన్‌నగర్, వెంకటేశ్వరపురం ప్రాంతాల్లో పార్టీ నేతలు వాజ్‌పేయి చిత్రపటానికి సోమవారం ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర సెల్స్ కన్వీనర్ సురేంద్రరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి, అవినీతికి తావులేని చక్కటి పరిపాలన వాజ్‌పేయి భారతదేశానికి అందించారన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వెంకటేష్, నర్సింహనాయుడు, అశోక్‌నాయుడు, హర్షవర్ధన్, సత్యనారాయణ, కృష్ణమూర్తి, శ్రీనివాసులుతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.